# ఇతరులతో సాగిపోయేదెలా

## మత్తయి 7:1-12,

## పరిశీలన, 3-12 వచనాలు

మన గత ప్రసంగములో మత్తయి 7:1−12ను ఇతరులతో సాగిపోవడం (యితర సూత్రాలతో) ఎలా అని స్టడీ చేయ నారంభించాం. సంబంధాలను గురించి మన లేఖన భాగంలోని ఆరు సంగతులను చూద్దాం − యితరులతో సాగిపోవుటకు అవసరమైన ఆరు సంగతులు. మొదటిది 1, 2 వచనాలకు సంబంధించినది: "మీరు తీర్పు తీర్చకుడి, అప్పుడు మిమ్మును గూర్చి తీర్పు తీర్చబడదు. మీరు తీర్చు తీర్పు చొప్పుననే మిమ్మును గూర్చియు తీర్పు తీర్చబడును, మీరు కొలుచు కొలత చొప్పుననే మీకును కొలువబడును." ఇతరులతో ఎలా మసలుకోవాలి అనే విషయాన్ని గూర్చి ఈ వచనాలనుండి కొన్ని సంగతులను చూచాం. ఈ సూత్రాన్ని బట్టి, కనీసం అయిదు సాధారణమైన ఆచారాలను ప్రభువు ఖండిస్తున్నట్టు నేను ప్రతిపాదించాను.

- మన పూర్వచరిత్ర, పరపక్షద్వేషములు మన తీర్మానాలకు రంగు దిద్దనివ్వడం.
- వాస్తవాలన్నీ ఎరుగకుండ, పరిస్థితులను తెలిసికోకుండ తొందరపాటుతో తీర్పులు చేయడం.
- ఇతరుల ఉద్దేశాలను గూర్చి తీర్పులు చేయ ప్రయత్నించడం.
- మనుష్యులు ఆచరించిన దానిని గూర్చి మేలును ఎంచక చెడును మాత్రమే నిరూపించడం.
- కఠినంగాను, దుఃఖంగాను, కపటంగాను తీర్పులు చేయడం − మన తీర్పులు ప్రేమతో, కనికరంతో లేకుండడం.

ఇవి సార్వత్రికమైన తప్పులు. వీటిలో ప్రతి దాని విషయంలో దోషులైన వారిని నీవు ఎరిగియుండవచ్చు కదా?

ఈ ప్రశ్న అడిగిన తరువాత, నన్ను క్షమాపణ అడుగనిమ్ము. ఇది మోసగించే ప్రశ్న. ఒకవేళ ఎవరైనా నీకు జ్ఞాపకానికి వస్తే, నీవు ఆ వ్యక్తికి తీర్పుతీర్చినట్లౌతుంది. నీకు కాకుండా, మత్తయి 7:1, 2ను మరొకరికి వర్తింపజేసేలా కనీసం నిన్ను దోషిగా చేసినవాడనై ఉంటాను.

### ఇతరులతో సాగిపోవుటకు రెండో అవసరత : మనం మన జీవితాల్లో అవసరమైన మార్పులు మొదట చేసికోవాలి (3-5 వచనాలు)

మార్చుకోవలసిన అవసరతవచ్చినప్పుడు, మనవైపు మనం చూచుకునే దానికి

బదులు యితరుల వైపు మనం చూస్తాం. ప్రభువుకు యిది తెలుసు, అందుకే ఆయన యిలా చెప్పాడు:

> నీ కంటిలోనున్న దూలమునెంచక[1] నీ సహోదరుని కంటిలోనున్న నలుసును[2] చూచుట యేల? నీ కంటిలో దూలముండగా, నీవు నీ సహోదరుని చూచి నీకంటిలో నున్న నలుసును తీసివేయనిమ్మని చెప్పనేల? వేషధారీ, మొదట నీ కంటిలోనున్న దూలమును తీసివేసికొనుము, అప్పుడు నీ సహోదరుని కంటిలోనున్న నలుసును తీసివేయుటకు నీకు తేటగా కనబడును (3-5 వచనాలు).

ఈ లేఖనంలో వినోదకరమైనది ఉంది. అయితే ప్రభువు ఎగతాళి చేయలేదు కాని, వినోదంగా[3] చెప్పాడు: ఇంకొకని కంటిలోని నలుసును చూడడానికి పడేప్రయాసలో, పొడవాటి పెద్దదూలం తన కంటిలో ఒక ప్రక్కన నిలిచి ఉన్న ఒక వ్యక్తిని ఊహించి చూడు. అది ఎదుటివారి తలమీద తగలకుండ అటు యిటు తిరగడం నీవు చూడగలవా?[4] మనం తీర్పు తీర్చే వారికంటే నీచమైన స్థితిలో ఉండి వారికి తీర్పు తీర్చ ప్రయత్నించడం ఎంతటి హాస్యాస్పదమైన స్థితియో గ్రహించాలని ప్రభువు కోరుతున్నారు.[5]

క్రీస్తు ప్రభువు శాస్త్రులయొక్కయు పరిసయ్యుల యొక్కయు వేషధారణను గూర్చి ఆలోచిస్తూ ఉండి యుండవచ్చు, కాని ఆ వాక్యం భాగంలోని సత్యాలు మనలను కూడా ఒప్పిస్తాయి. మన సొంత తప్పులను అలక్ష్యంచేసి యితరుల తప్పులను చూడడం ఎంత సులభమో! బత్షెబతో వ్యభిచరించి, ఆమె భర్తను చంపించిన రాజగు దావీదు కథ జ్ఞాపకం ఉందా (2 సమూ. 11)? పేదవాడి గొర్రెపిల్లను చంపిన ధనవంతుని కథను నాతాను దావీదుకు వినిపించాడు. “ఆ మనుష్యుడవు నీవే” అని నాతాను అతనికి తెలియజేసేవరకు, అట్టివాడు “మరణమునకు పాత్రుడు”[6] అని దావీదు అన్నాడు (2 సమూ. 12:1-7). అటు తరువాత, అతని ఉరితీసేదానికి బదులు, దావీదు ప్రార్థనా కూడికకు సిద్ధపడ్డాడు (2 సమూ. 12:13; కీర్తన 51:32).

ఇతరులతో సాగి పోవడంలో మొదటిగా మనలను మనమే పరీక్షించుకుని మనలో ఏ మార్పులు చేసికోవాలో చూచుకొమ్మని ప్రభువుకోరుతున్నారు.

క్రీస్తుచే ఖండింపబడిన తీర్పు తీర్చు అలవాట్ల జాబితాకు మూడవ వచనంలోని తొలి భాగము మరొక సంగతిని చేర్చవచ్చు. “చూచు”[7] అని తర్జుమా చేయబడిన గ్రీకు పదానికి “పరీక్షించు, పరిశీలించు” అని అర్థమిస్తుంది.[8] నలుసును చూడడం అంత సులభమేమీ కాదు. “నా కంటిలో నలుసు పడిందని” ఎవరైనా అంటే, దాన్ని చూడగలగడం అంత తేలికేమీ కాదు. నీవు చాలా దగ్గరకు రావాలి సరిగదా. వెలుగు దానిమీద నేరుగా పడాలి. తీర్పు తీర్చే అలవాట్లకు మనం దీన్ని కూడా చేర్చాలి:

- మనుష్యులలో మేలైనదికాకుండ చెడ్డ దానిని చూడవెదకడం; విమర్శించ డానికిగాను ఏదో యొక తప్పు కనుగొనాలని ప్రసవవేదనతో పరీక్షించడం.

ప్రభువైన యేసును శాస్త్రులు పరిసయ్యులు చూస్తున్న తీరు ఖచ్చితంగా అదే.

"దూలము, నలుసు" అనేవి ఒకే మూల పదార్థానికి చెందినవైనందున, ఈ సూచనలను క్రీస్తు ఉపయోగించియుంటారని అనేకమంది వ్యాఖ్యానకర్తలు, పలువురు తర్జుమా దారులు అభిప్రాయపడ్డారు. ఒకటి మహా చిన్నది, మరొకటి మహాపెద్దది, అయితే రెండును కొయ్యకు సంబంధించినవే. NIVలో "రంపపు పొట్టు ధూళి," "చెక్క" అనేవి ఉపయోగించబడ్డాయి.

"దూలము, నలుసు" అనేవి ఒకే పదార్థానికి సంబంధించినవనే భావన ఆసక్తికరమైన కొన్ని ఆలోచనలను రేకెత్తించింది. మన జీవితంలోని తప్పులకంటెను యితరులలో ఉన్న దోషాలను వెదకడం వాటి విషయంలో చాలా సున్నితంగా ఉండడం మానవ స్వభావం లోని వాస్తవంలా కన్పిస్తుంది. మనం జీవితంలో మనకు కన్పించేవి యితరులు జీవితాల్లోనికి పొడిగించడాన్ని "Projection" అని మనోతత్వవేత్తలు అంటారు. (అంటే, మనవలే ప్రతిఒక్కరు ఉన్నారని మనం ఊహించుతామని అర్థం.). పైగా, అదే పాపములు యితరుల జీవితాల్లో మనకు కన్పించునంత చెడ్డగా అవి మన జీవితాల్లో మనకు అంత చెడ్డగా కన్పించవనే మాట వాస్తవం. ("తన కంపు తనకింపని పరకంపు చెడుకంపు" అన్నట్టు ఉంటుంది). "నేను స్థిరుడను, నీవు మొండివాడవు; అతడు పందితలవాడు. నేను తిరిగి ఆలోచించాను; నీవు నీ మనస్సు మార్చుకున్నావు; అతడు మాట తప్పాడు" అని పరిస్థితులను మనం చూచే విధానాన్ని గూర్చి రస్సల్ ఉదహరించాడు. ఇందు విషయమై నీకు బైబిలు ఉదాహరణ కావాలనుకుంటే, యూదాను గూర్చియు అతని కోడలైన తామారును గూర్చియు ఆలోచించు. తామారు "వేశ్యగా" ప్రవర్తించి, "గర్భవతియైయున్నట్టు" యూదాకు తెలిసివచ్చినప్పుడు, ఆమెను చంపడానికి అతడు సిద్ధపడ్డాడు (ఆది. 38:24); ఆ బిడ్డకు తండ్రి యూదాయేనని తామారు రుజువు పరచినప్పుడు, మరణ శిక్ష విధించబడాలన్న సంగతి వెంటనే విడిచిపెట్టబడింది (ఆది. 38:25, 26).

కొయ్యకు సంబంధించిన రెండింటిని కావాలనే ప్రభువు ఉదహరించడాన్ని ఉపయోగించినట్టయితే, పెద్ద మోతాదులో పాపమున్న మనిషి చిన్న మోతాదులో పాపమున్న మనిషి కంటె అధికుడైయున్నట్టు ప్రవర్తించే హాస్యాస్పదపు స్థితి నెలకొనియుంది. ఈలాటి విరుద్ధమైన స్థితిని గూర్చి పౌలు రోమా 2:1–3లో యిలా వ్రాశాడు:

> కాబట్టి తీర్పు తీర్చు మనుష్యుడా, నీ వెవడవైనను సరే నిరుత్తరుడవైయున్నావు. దేని విషయములో ఎదుటివానికి తీర్పు తీర్చుచున్నావో దాని విషయములో నీవే నేరస్థుడవని తీర్పు తీర్చుకొనుచున్నావు; ఏలయనగా తీర్పు తీర్చు నీవును అట్టి కార్యములనే చేయుచున్నావు కావా? అట్టి కార్యములు చేయువారి మీద దేవుని తీర్పు సత్యమును అనుసరించునదే అని యెరుగుదుము. అట్టి కార్యములు చేయు వారికి తీర్పు తీర్చుచు వాటినే చేయుచున్న మనుష్యుడా, నీవు దేవుని తీర్పు తప్పించుకొందువని అనుకొందువా?

ఈ విధంగా నడుచుకునే వారిని క్రీస్తు ప్రభువు ఎలా చిత్రించారు? ఆయన మాటలను దాచి మాట్లాడలేదు. మత్తయి 7:5 తొలి భాగంలో, "వేషధారులారా" అని ఆయన అన్నారు. వేషధారణగా ఉంటే, అది మనలను వేషధారులనుగా చేస్తుంది. మనము

యితరులను ఎల్లప్పుడు విమర్శిస్తున్నామంటే, మన రికార్డు క్లియర్‌గా ఉందని దాని అర్థం – అంటే మన జీవితాలు సరిగా ఉన్నాయనే – లేకుంటే విమర్శించడానికి మనం యోగ్యులం కాదు. అదే సమయంలో, మన కండ్లలో నుండి పెద్ద టెలీఫోన్ స్తంభాలు[9] పొడుచుకొని వస్తాయి.

మరల, తీర్పును గూర్చి మనం చెప్పేది ఏమంటే, మన వద్దనుండి అది ప్రారంభం కావాలి. "మొదట నీ కంటిలోనున్న దూలమును తీసివేసికొనుము" అని ప్రభువు అంటున్నారు. ఇతరుల పాపాలు ఒప్పుకొనడం తేలిక; మన పాపాలు మనం ఒప్పుకొనడమే కష్టం. పలు సందర్భాలలో పౌలు స్వపరీక్షను గూర్చి ప్రస్తావించాడు: "... మిమ్మును మీరే శోధించుకొని చూచుకొనుడి; మిమ్మును మీరే పరీక్షించుకొనుడి" (2 కొరింథీ. 13:5). "కాబట్టి ప్రతి మనుష్యుడు తన్ను తాను పరీక్షించుకొనవలెను" ... "అయితే మనలను మనమే మిమర్శించుకొనిన యెడల తీర్పు పొందక పోదుము" (1 కొరింథీ. 11:28, 31). రోమా 14:13 ప్రత్యేకంగా వర్తిస్తుంది. ఫిలిప్స్ తర్జుమా ఈ వచనాన్ని యిలా తర్జుమా చేస్తుంది: "ఒకని వైపుకు మరొకడు విమర్శించు చూపులను మళ్లించకుడి. మనం విమర్శనాత్మకంగా ఉండగోరితే, మన సొంత ప్రవర్తన మీద విమర్శనాత్మకంగా ఉండి, మరొక సహోదరుడు తొట్రిల్లకుండునట్లు లేక పడిపోకుండునట్లు ఏమియు చేయకుందుము!"[10]

ఏ పాపము/ దూలము తొలిగించబడాలి? ఏ పాపమైనా తీసివేయబడాలి – కాని ఈ సందర్భంలో, ప్రత్యేకించి తీర్పు తీర్చే పాపాన్ని గూర్చి మాట్లాడుతున్నాం.

తన్నుతాను (స్వయం) పరీక్షించుకొనడంలోకూడ, కొంత కామన్‌సెన్స్ కావాలి. వ్యక్తిగతమైన లోపాలు లేక తప్పిపోడాల వలన ఏర్పడిన మనోవేదనను గూర్చి మనం మాట్లాడడం లేదు, "మరణకారణం కనిపెట్టుటకు శాశ్వతమైన శవ పరీక్ష"యని ఒక వ్యక్తి అన్నాడు. అయితే, యితరులతో మనం సరిగా మసలుకొనగోరితే, మన సొంతజీవితంలో అవసరమైన మార్పులు చేసికొనవలసియుంది. మనతో దాన్ని ప్రారంభించినట్టయితే, యితరులయెడల తీర్పరులుగా ఉండకుండా మిగిలిపోతాం.

3నుండి 5 వచనాలవరకు మనం యిప్పుడు వదలిపెట్టాలి. ఈ వచనాల్లో ప్రాథమికంగా ఒత్తి పలకడాన్ని చూచాం. అయితే నేను యిక్కడ నొక్కి చెప్పవలసిన ఒక రమ్యమైన సత్యం ఈ భాగానికి చివరిలో ఉంది.

## ఇతరులతో సాగిపోవుటకు మూడో అవసరత : మనము యితరులకు వినయంతోను సున్నితంగాను సహాయం చేయాలి (5బి వ.)

మనం నిజంగా ప్రేమించే ఒకరిలో పాపమున్నట్టు మనం చూచినట్టయితే, ఆ పాపము[11] తొలిగించుకొనడానికి సహాయం చేయ ప్రయత్నించుతాం. 5వ వచనం చివరి భాగంలో ఇది సూచితమై ఉంది: మొదట నీ కంటిలోని దూలము తొలిగించుకొనుము, "అప్పుడు నీ సహోదరుని కంటిలోనున్న నలుసును తీసివేయుటకు నీకు తేటగా కనబడును"

అని ప్రభువు అన్నారు. మన తొలి ప్రాధాన్యత మన పాపముల విషయమై పని కలిగియుండడం, అయితే మన జీవితాలను క్రమంలో ఉంచుకున్న తరువాత, ఒక సహోదరుని పాపముల విషయం సహాయం చేయడాన్ని ఆయన నిరాశపరచలేదు.[12]

ఒక సహోదరుని హృదయంలోనుండి, జీవితంలోనుండి పాపాన్ని తొలిగించు కొనడానికి సహాయపడవలెనని ఉపదేశించిన అనేక భాగాలున్నాయి:

> సహోదరులారా, ఒకడు ఏ తప్పిదములోనైనను చిక్కుకొనినయెడల ఆత్మసంబంధు లైన మిలో ప్రతివాడు తానును శోధింపబడుదునేమో అని తన విషయమై చూచుకొనుచు, సాత్వికమైన మనస్సుతో అట్టివానిని మంచిదారికి తీసికొని రావలెను. ఒకని భారముల నొకడు భరించి, యిలాగు క్రీస్తు నియమమును పూర్తిగా నెరవేర్చుడి (గలతీ. 6:1, 2).
>
> నా సహోదరులారా, మీలో ఎవడైనను సత్యమునుండి తొలిగిపోయినప్పుడు మరియొకడు అతనిని సత్యమునకు మళ్లించినయెడల పాపిని వాని తప్పుమార్గమునుండి మళ్లించువాడు మరణమునుండి యొక ఆత్మను రక్షించి అనేక పాపములను కప్పివేయునని తాను తెలిసికొనవలెను (యాకోబు 5:19, 20).

మత్తయి 7:3–5లోని కంటిలోని నలుసు అని ప్రభువు ఉదాహరణ సహాయము యొక్క అవసరతను ప్రధానంగా తెలుపుతుంది: కన్ను సున్నితమైనది. కంటిలో పడిన చిన్న నలుసుకూడా నవ్వులాట పని కాదు. నీకు పిల్లలున్నట్టయితే, వారి కంటిలో ఏదైనా పడినప్పుడు, "నాకంటిలో ఏదో పడిందని కేకలు వేస్తారు."

సహాయం చేయువారు అనుసరించవలసిన విధానం కూడా ఈ ఉదాహరణ సూచిస్తుంది. నా కంటిలో ఏదైనా పడినప్పుడు, దాని తొలిగించడానికి నీవు ముందుకువస్తే, నీవు కనికరం కలిగియుండాలని, జాగ్రత్తగా ఉండాలని నేను కోరుకుంటాను.[13] ఇతరులతో మనం మసలుకునేటప్పుడు మనం సున్నితంగా ఆలోచించాలి. "సాత్వికమైన మనస్సుతో అట్టివానిని మంచిదారికి తీసికొనిరావలెను" అని పౌలంటాడు (గలతీ. 6:1).

పరిశుద్ధ దేవుని యెదుట మన మందరం పాపులమే ఆయన న్యాయ పీఠం యెదుట మన మందరం ఒక నాడు నిలువవలసియుంది. ప్రతివానికి ఆత్మసంబంధమైన సహాయం కావాలి – కాని అలా మనం సహాయం చేసేటప్పుడు, జాగ్రత్తతోను, దయగాను చేయవలసి యుంటుంది.

## ఇతరులతో సాగిపోవుటకు నాల్గో అవసరత : భేదాలు, వ్యత్యాసాలను ఎలా దిద్దాలో మనం నేర్చుకొని ఉండాలి (6 వ.)

"కుక్కలు", "పందులు" అనే వచనం వద్దకు మనం వచ్చాం (6వ.). ఇక్కడ ఒక చిక్కు ప్రశ్న ఉంది: ప్రభువు చెప్పిన దానికి వ్యతిరేకమైన స్వభావాన్ని యిది కనుపరచుతున్నట్టుంది. మనం వెళ్లి యితరులను "కుక్కలు," "పందులు" అని పిలువ వలెనా? మనలను క్రమమైన హద్దులలో ఉంచడానికి ఈ ప్రతిపాదనను ప్రభువు పెట్టినట్టున్నారు. మనం కపటంగాగాని, తప్పులు వెదకేవారంగాగాని, లోపాలు

కనిపెట్టేవారంగా గాని ఉండరాదు. లేదా మనం మోసపోయేవారంగా కూడా ఉండరాదు. దేవుడు మనకు కామన్‌సెన్స్ అనుగ్రహించారు, ఇతరులతో మనం మసలుకునేటప్పుడు, దానిని మనం వాడుకోవాలని ఆయన కోరుకుంటాడు. మనం జాగ్రత్తగా ఉండాలి, పరిశోధకులు కాకుండాలి, కాని అదే సమయంలో అజాగ్రత్తగా ఉండకూడదు సరిగదా, ఊరకే నమ్మేవారంగా కూడా ఉండకూడదు.

1నుండి 5 వచనాల వరకు మాత్రమే ప్రభువు ఉపయోగించియుంటే, మనం చిక్కటికి రక్షణలేని వారమైయుండేవారమే – తప్పు తీర్పు చేసి మన నెత్తి మీదికి శిక్ష తెచ్చుకొన కుందునట్టు తప్పు తీర్పులు చేస్తామనే భయ – భ్రాంతులతో మనం నిలిచియుండే వారమే. అయితే యితరుల విషయంలో మనం కొన్ని తీర్పులు చేయవలసియున్నట్టు ఆయన 6వ వచనంలో సూచిస్తున్నారు. కుక్కలు, పందులను సూచించుతూ ఆయన ఈ మాటలు చెప్పుతున్నారు: "పరిశుద్ధమైనది కుక్కలకు పెట్టకుడి, మీ ముత్యములను పందులయెదుట వేయకుడి; వేసినయెడల అవి ఒక వేళ వాటిని కాళ్లతో త్రొక్కి మీ మీదపడి మిమ్మును చీల్చివేయును."

క్రీస్తు ప్రభువు మాటల భావాన్ని మనం చర్చించకముందు, ప్రత్యేకించి ఆ దినాల్లో, కుక్కలు పందులు ఎలా చూడబడ్డాయో మనం గ్రహించాలి. మోషే ధర్మశాస్త్రం క్రింద, ఆ రెండును అపవిత్రమైన జంతువులే.[14] నీవు కుక్కలను గూర్చి ఆలోచన చేసేటప్పుడు, ఎవరో కొందరు సొంతగారైయుండి అతి దయగా చూచుకునే పెంపుడు జంతువులను గూర్చి మనం ఆలోచించడం లేదు. కాని దుష్టచేష్టలుగలిగి క్రూరమైయున్న కంచలవెంట తిరిగి పెంటతినె వాటిని గూర్చి ఆలోచిస్తున్నాం. పాపభరితులను కొన్నిసార్లు "కుక్కలనే" సంకేత భాషతో బైబిలు వర్ణించింది (మత్తయి 15:26; ఫిలిప్పీ. 3:2; ప్రకటన 22:15). యూదుల మనస్సులో పంది అపవిత్రతకు చిహ్నమైయుంది. విషయం యిలా ఉండగా, అన్ని కాకపోయినా, పాలస్తీనాలోని పందులు క్రూరంగా పరుగెత్తేవి.

ఈ చివరి సంగతిని అనేకమంది వ్యాఖ్యానకర్తలు పట్టించుకోనట్టున్నారు. "మిమ్మును చీల్చివేయును" అనే ప్రయోగం కుక్కలకు సంబంధించిందిగా వారు తలంచుతారు. ఈ విధంగా వారు ఈ జంతువులను గూర్చి సరిగా ఎరుగనట్టు కనుపరచుతారు. తన చిన్న పిల్లలకు నీవు అతిసమీపంగా వెళ్లావో తల్లి పంది వారి కాళ్లను చీల్చివేసేలా వారెన్నడూ దాని సమీపానికి వెళ్లి ఉండరు. దుష్టచేష్టలుగల క్రూరమైన పందులు ఉన్నట్టు వారికి తెలియనట్టుంది.[15]

పందులు, కుక్కల స్వభావాన్ని మనస్సులో ఉంచుకొని, 6వ వచనాన్ని మరొక సారి చూడు. హాస్యాస్పదమైన దృశ్యాలను ప్రభువు మరోసారి సూచించారు. "పరిశుద్ధమైన దానిని కుక్కలకు" పెట్టే సంగతిని గూర్చి ఆయన మొదటిగా మాట్లాడారు. పరిశుద్ధమైనది లేక పవిత్రమైన దానిని ఒక సాధారణమైన కుక్క అభినందించే మార్గమేలేదు. బలిపీఠంనుండి మాంసాన్ని తీసి యాజకులు కుక్కలకు వేయడాన్ని గూర్చి మాట్లాడుతున్నట్టు కొందరు తలంచారు. ఆలాటిది ఎన్నటికి, ఎన్నటికి, ఎన్నటికి జరుగదు. మిగిలిన కళేబరంలో ఏ భాగమైనా అగ్నిచేత దహిస్తారు (లేవీ. 6:24–30; 7:17).

"ముత్యములను పందులకు" వేయడాన్ని గూర్చి ప్రభువు పలికారు. పరిశుద్ధమైన

దానిని కుక్కలు ఎలా అభినందించలేవో, పందులు కూడా ముత్యాలను ఎన్నడూ అభినందించ లేవు. ముత్యాలు భోజనం కావని అవి కనుగొన్న వెంటనే, "వాటిని చీల్చివేయడానికి" అవి చూస్తాయి. నా చిన్నతనంలో, పందులకు తిండిపెట్టడానికి ఉదయకాలం లేచిన సంగతి జ్ఞాపకం వస్తుంది. ఒక బక్కెట్‌లో వాటి తిండిని నేను కలుపుతున్నానని అవి విన్నవెంటనే, అవి కవర్లాడ నారంభించాయి. వాటి సమీపానికి నేను దాని తెచ్చినప్పుడు ఒక దాని మీద ఒకటి ఎక్కడానికి ఆతురపడుతున్నా వాటి తొట్లలో నీళ్లు పోయడం బహుకష్టమైపోయింది. అవి తినే ధాన్యము పాలు కలిపిపోయ కుండా, నేను ముత్యాలనే వేశాననుకో, నా గతి ఎలాగుండేదో!

అయితే యిప్పుడు మన ప్రశ్న ఏమంటే– "ప్రభువైన యేసు సూచించే ఈ కుక్కలెవరు; పందులెవరు?" "పరిశుద్ధమైనదేది, ముత్యములేవి?" అని అడగడంతో ప్రశ్నకు బాగా జవాబు చెప్పవచ్చు. "అమూల్యమైన ఒక గొప్పముత్యము"గా దేవుని రాజ్యం (సంఘము) ప్రభువుచే సూచింపబడింది (మత్తయి 13:45, 46). రాజ్యమును గూర్చిన సందేశాన్ని సువార్త అన్నారు (మత్తయి 4:23; 9:35, 24:14లను చూడు). దేవుని వాక్యము పరిశుద్ధమైనది (రోమా 1:2; 2 పేతురు 2:21). ఈ పరిశుద్ధమైన సందేశం "మహిమైశ్వర్యము"గా చెప్పబడింది (2 కొరింథీ. 4:7).

ఇదంతయు సత్యమైయుండగా, ఆత్మ సంబంధమైన దానిని అభినందించలేని వారికి వాక్యాన్ని అందించడానికి వ్యతిరేకముగా క్రీస్తు హెచ్చరించినట్టు ఎక్కువమంది వ్యాఖ్యాన కర్తలు నమ్ముతారు. తీతు 1:15లో ఉన్నట్టు, సత్యాన్ని నిరాకరించే జనులను గూర్చి యిది మాట్లాడబడింది: "అపవిత్రులకు, అవిశ్వాసులకు ఏదియు పవిత్రముకాదు ..." తమ మాటలను నిరాకరించే శాస్త్రులు పరిసయ్యులు ప్రభువు మనస్సులో ఉండి ఉండ వచ్చు.

6వ వచనానికి ఈ వివరణ కొంతమందికి అంగీకారం కాకపోయినా, ఈ లేఖన భాగానికి యిట్టిది యుక్తమని నేను భావిస్తాను. యూదుల మధ్యకు ప్రభువు తన శిష్యులను పంపినప్పుడు, వారి మాటను నిరాకరించినట్టయితే, తమ కాళ్ల ధూళి అక్కడనే దులిపివేయుడని[16] వారికి ఆయన తెలిపారు (మత్తయి 10:13, 14).[17] యూదులు పౌలు సందేశాన్ని నిరాకరించిన ప్రతిసారి, అతడు అన్యజనుల వైపుకు మళ్లేవాడు (అపొ. 13:44-51; 18:5, 6; 19:9; 28:17-28).

ఈ తీర్పు చేయడం బహుకష్టం. ముందుగా ఒకడు "కుక్క" లేక "పంది" అని తెలిసికోలేం. ప్రేమ ఎల్లప్పుడు శ్రేష్ఠమైనదాన్ని నమ్ముతుంది. సువార్త వినడానికి ప్రతివానికి మనం అవకాశం యివ్వాలి (మత్తయి 28:18-20; మార్కు 16:15, 16). మరోవైపు, ఒకనికి నీవెల్లప్పుడు బోధిస్తున్నా, ఒకడు నిరాకరిస్తూనే ఉన్నట్టయితే, (మన సమయం విషయంలో మంచి గృహనిర్వాహకులై ఉండాలి[18]) "పంది ముందు ముత్యాలు వేయడం ఆపి, వినేవారిని చూడడం మంచిది."[19]

పలురకాలైన ప్రజలను మనం సంధింపవలసివస్తుందని, అందులో ప్రతిఒక్క అవకాశాన్ని ఎలా ట్రీట్ చేయాలో మనం నేర్చుకోవలసియుందని 7:1-12లోని ఉదాహరణ తేటపరచుతుంది. కండ్లలో నలుసులు పడి బాధింపబడుతుండే ప్రజలుంటారు.

వారికి మన ప్రేమ అవసరం, మరియు మనం ఎన్నడే సహాయం చేయలేని పందులు, కుక్కలు వంటివారు ఉంటారు. వారిని సమీపించే ప్రతి యత్నాన్ని వారు నిరాకరిస్తారు. వారికుండే ఒకే ఆసక్తి మనలను చీల్చివేయడమే. వారికి మనం చేయగలిగిందంతా, వారిని విడిచిపెట్టడమే.

కన్నీటితో తన కాళ్లుకడిగిన స్త్రీ పట్ల ప్రభువు కనుపరచిన కనికరమును గూర్చి ఆలోచించు (లూకా 7:36-50). అలాగే వ్యభిచారమందు పట్టబడిన స్త్రీనికూడ (యోహాను 8:2-11). హృదయ కాఠిన్యంతో నిండుకొనిన శాస్త్రులను పరిసయ్యులను ఆయన నిరాకరించిన దానికి గల తారతమ్యాన్ని ఆలోచించు (మత్తయి 23). "అయ్యో, వేషధారులైన పరిసయ్యులారా, శాస్త్రులారా" అంటూ ఆయన మాటిమాటికి అన్నారు (13,-15, 23, 25, 27, 29 వచనాలు).

కుక్కలను లేక పందులను తుపాకీతో కాల్చివేయండియని క్రీస్తు ప్రభువు అనలేదు. వాటిని వదలివేయండని ఆయన అన్నారు: మీ పరిశుద్ధమైనవి వాటికి పెట్టకుడి. వాటికి మీ ముత్యమును వేయకుడి. ఇక్కడ పౌలు హెచ్చరిక తగినదైయుంటుంది: "శక్యమైతే మీ చేతనైనంతమట్టుకు సమస్త మనుష్యులతో సమాధానముగా ఉండుడి" (రోమా 12:18).

## ఇతరులతో సాగిపోవుటకు ఐదవ అవసరత :

## దేవునిపై ఆనుకొనడానికి తీర్మానించుకోవాలి

## (7-11 వచనాలు)

ప్రార్థనయందున్న గొప్ప శక్తి అనే 7నుండి 11 వచనాల వద్దకు యిది మనలను తెస్తుంది. ఈ ప్రసంగంలో ఈ వచనాలను వివరించాను. మనం విమర్శించే అంశంలో ఈ లేఖన భాగం ఎలా తగియుందో చూపడమే యిక్కడ నా ఉద్దేశమైయుంది.

మనం తీర్పరులమై ఉండ కూడదనియు, మనము కనికరము దయగలవారమై యుండాలనియు ఈ లేఖన భాగం నుండి మనం నేర్చుకున్నాం. అదే సమయంలో, మనం, మోసపోయేవారిలా ఉండకూడదనియు, ఏప్పుడు మన కాళ్లదుమ్ము దులిపివేయ వలెనో ఎరిగి ఉండాలనియు నేర్చుకున్నాం. ఈ తీర్పులు చేయడం కష్టమే. మనం సున్నితంగా ఉండవలసిన సమయంలో కురుకుగాను, లేక కరుకుగా ఉండవలసియుండగా సున్నితంగాను మనం ఎలా ఉండగలం? 7నుండి 11 వచనాలలో మనకు లభిస్తుంది. మనం దేవునిపై ఆనుకోవాలి:

> అడుగుడి మీ కియ్యబడును, వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తీయబడును. అడుగు ప్రతివాడును పొందును, వెదకువానికి దొరకును, తట్టువానికి తీయబడును. మిలో ఏ మనుష్యుడైనను తన కుమారుడు తన్ను రొట్టెను అడిగినయెడల వానికి రాతినిచ్చునా? చేపను అడిగినయెడల పామునిచ్చునా? మీరు చెడ్డవారై యుండియు మీ పిల్లలకు మంచి యీవుల నియ్యనెరిగియుండగా పరలోకమందున్న మీ తండ్రి అడుగువారికి అంతకంటె ఎంతో నిశ్చయముగా మంచి యీవులనిచ్చును.

ఇవి ఎంతటి గొప్ప వచనాలు! దేవుడు ప్రార్థనల నాలకించును! ప్రేమగల తండ్రి తమ పిల్లల మనవులకు స్పందించినట్టే, దేవుడు మన యెడల చూపును.

ఈ లేఖన భాగము మన అంశానికి పలువిధాలుగా సంబంధం కలిగియుంది. ఉదాహరణకు, దేవుడు మన యెడల కనికరముగలవాడై యున్నారు. ఇతరులయెడల మనమును కనికరముగలవారైయుండాలని యిది గుప్తం చేస్తుంది. ప్రత్యేకంగా, మన అవసరతలతో మనం దేవుని చెంతకు వెళ్లవచ్చు – ఈ సందర్భంలో, యితరులతో ఎలా మసలుకోవాలి అనే అవసరం. ఈ సందర్భంలో వర్తమానము యాకోబు 1:5ఎ ని పోలినదైయుంది: "మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్నయెడల అతడు దేవుని అడుగవలెను."

"తన్ను అడుగువారికి అంతకంటె ఎంతో నిశ్చయముగా మంచి యీవుల నిచ్చును" అని 11వ వచనం అంటుంది. "ఒక పెద్ద యిల్లు, లేక మంచి ప్రయాణవసతి లేక ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగం మంచిది" అని ఒకడు అనవచ్చు – కాని యింతకు నిజంగా "మంచిది" ఏది? ఆత్మ సంబంధమైన వరములు మేలైనవి కావా? ఇందులో వివేచనతో కూడిన ఆత్మ: అన్ని రకాలైన ప్రజలతో ఎలా మసలుకోవాలో ఎరిగి యుండడం మేలు. నీకు సంబంధాలు ప్రాముఖ్యమైనవైతే, ఎక్కువ సమయం నీవు ప్రార్థనలో గడుపుతావు.

## ఇతరులతో సాగిపోవుటకు ఆరవ అవసరత : మనము సువర్ణ సూత్రముననుసరించి జీవించాలి ( 12 వ.)

చివరికి మనం 12వ వచనానికి వచ్చాం. కొండమీద ప్రసంగంలో యిది ముఖ్యమైన పాయింటుగా పిలువబడింది. నిశ్చయంగా, మనుష్యులతో ఎలా మసలుకోవాలి అనే చర్చలో యిది శిఖరాగ్రమైయుంది. "కావున ప్రతి విషయములోను" అంటూ యిది ప్రారంభమౌతుంది. మానవ సంబంధాలకు సంబంధించి ఈ ప్రసంగంలో ఏమైతే చెప్పబడిందో దానినంతటిని యిది సంక్షిప్తం చేస్తుంది: అది సహోదరునికీ, శత్రువుకు సంబంధించే, స్నేహితునికీ శత్రువుకు సంబంధించియేగాని – ఎవరితోనైనా ఎలా మసలుకోవాలి అనేదాన్ని తేల్చివేసింది. మరి ప్రత్యేకించి, 7:1–11లో యితరులతో మనం ఎలా సాగిపోవాలని నేర్చుకున్నామో దాని నంతటిని సంక్షిప్తం చేస్తుంది. "కావున (ప్రతి విషయములో) మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుదురో ఆలాగుననే మీరును వారికి చేయుడి. ఇది ధర్మశాస్త్రమును ప్రవక్తల ఉపదేశమునైయున్నది." దీన్ని మామూలుగా మనం యిలా అంటాం: "ఇతరులు మీకేమి చేయాలనుకుంటారో మీరును వారికి ఆలాగే చేయుడి." ప్రభువైన యేసు ప్రతిపాదనలలో సార్వత్రికంగా ఎరిగిన ప్రతిపాదనగా ఉంటుంది. దాదాపు ప్రతి ఒక్కరు[20] దీన్ని అభినందిస్తారు; కనీసం దానిని ఆచరింపనివారు కూడా దీన్ని అభినందిస్తారు.

ప్రభువైన యేసుకు ముందు, అనేకులు 12వ వచనంలోని సూత్రాన్ని వ్యతిరేకార్థంలో

తెలిపారు: "ఇతరులు నీకు ఏమి చేయకోరవో, దానిని వారికి చేయకు." ఈ స్వభావాన్ని వ్యక్తపరచిన వారిలో సోక్రటీసు, అరిస్టోటల్, హెలెన్ (అనే వన్నెకెక్కిన యూదుల ఉపదేశకుడు) కన్‌ఫూసియస్, బుద్ధ అనే వారున్నారు. అయినా, నిశ్చయమైన రూపంలో దీనిని వ్యక్తపరచినవారు ప్రభువైన క్రీస్తే: "... ఇతరులకు చేయుము"

వ్యతిరేకార్థంలోను నిశ్చయమైన రూపంలోను ఎంతో వ్యత్యాసముంది – "కాదు" (లేదు) అనే పదం చేర్చడం లేక తీసివేయడం కంటెను ఎంతో వ్యత్యాసముంది. వ్యతిరేకార్థపు ప్రతిపాదన ప్రధానంగా తన్నుకాపాడుకొనడానికి సంబంధించింది. నిశ్చయమైనదైతే, స్వార్థాన్ని మరచిపోయేదైయుంటుంది. ఏమి చేయక పోవడంతో వ్యతిరేకార్థమైన దాన్ని నెరవేర్చవచ్చు.[21] కాని నిశ్చయమైనదైతే కేవలం మంచి చేయడంవలననే నెరవేర్చ బడుతుంది. వ్యతిరేకార్థపు తత్వశాస్త్రాన్ని కౌగలించుకొనడానికి ఒకడు భక్తిగలవాడై ఉండవలసిన అవసరం ఉండదు. ఎందుకంటే, అది జీవితాన్ని సహజంగా చూచినట్టౌతుంది – కాని రెండవదైతే పవిత్రమైన భక్తికి ఆధారమైనదై యుంటుంది (12బి వ.). "ఇది నిజమైన భక్తి యొక్క సారమైయున్నది" అని ఫిలిప్స్ తర్జుమా అంటుంది.[22]

ఈ చర్చలో ఈ భాగం చివరిగా రావడంలో, ముందుగా చెప్పిన దానిని యిది సంగ్రహిస్తుంది. కాని బాంధవ్యాలలో ఎదురయ్యే సవాలక్ష పరిస్థితులను చక్క దిద్దడానికి కూడా ఈ సూత్రము తెలుపుతుంది. సాధ్యమయ్యే ప్రతి బాంధవ్యపు సమస్యను తీర్చడానికి వ్రాయబడిన పుస్తకం ఉందనుకో. అలాటిది ఎంత పెద్ద గ్రంథమైయుంటుందో ఊహించ ప్రయత్నించు. నీవు ఒకనితో సంబంధం కలిగియున్నావ్, సమస్యవచ్చింది. అతనితో ఎలా మసలుకోవాలో (కొనసాగాలో) కనుక్కోడానికి ఆ గ్రంథంలోని పేజీలను ఆత్రుతగా తిరగవేస్తావు. ఒక గంట సేపు అయిన తరువాత, నీకు కావలసిన జవాబు దొరికింది – కాని అంతలో ఆ వ్యక్తి వెళ్లిపోయాడు. ఆలాటి ఒక పెద్ద గ్రంథం నీ చేతికి యివ్వకుండ, ఆ సమస్యను యిలా పరిష్కరించాలని యేసు చెప్పెను, "ఆ పరిస్థితి యిటు మరలివుంటే ఎలాగుంటుంది అని నిన్ను నీవే ప్రశ్నించుకో. అలాగే నీకు జరిగితే నీకు ఎలా ఉంటుంది? నేను ఎలా ట్రీట్ చేయబడగోరతాను? అప్పుడు ఆలాగే నీవును అతనికి చేయి. (నీవు అతనికి చేసింది, అతడు నీకు చేస్తే నీవు ఎలా బాధపడతావు? ఆ సంగతి నీవు పరీక్షించుకొని యుంటే, నీవు అతనికి ఆ కీడు చేయవు గదూ?"

ఇది ఎంత సరళమైనది, అయినా, ఎంత గంభీరమైనదైయుంది? ఈ సూత్రాన్ని అనుసరించి జీవితం కొనసాగితే సాటి వారితో సంబంధాలు ఎలాగుంటాయో, లోకం ఏ రీతిగా మారిపోతుందో నీవు చిత్రించుకోగలవా? వ్యాపారమంతా అలా సాగిపోతే ఎలా ఉంటుంది? ప్రతి ఉద్యోగి సాటివారిని అలా చూస్తుంటే ఎలా ఉంటుంది? కుటుంబ సంబంధాలలో, బంధు జనులలో ఈ సూత్రమే నిలిచియుంటే– అవి ఎలా ఉంటాయి? ప్రతి కుటుంబంలోను, పాఠశాలలోను, ప్రతి దేశంలోను, ప్రతిస్థానిక సంఘంలోను ఈ సూత్రం పనిచేస్తే పరిస్థితులు ఎలా ఉంటాయి. (ప్రేమకంటె ద్వేషాన్ని పెంచుకొనడానికి మనుష్యులు తమ చెవులను యిస్తారు; దానితో సంబంధాలు చెడిపోతాయి).

ఒక్క చివరిసారి ఆగి, కామన్‌సెనస్ ఉపయోగించునట్లు ప్రభువు ఎదురుచూస్తారని చెప్పనిమ్ము. ఇతరుల స్థానంలో మనలను మనం పెట్టుకున్నప్పుడు, కీడు చేయనంత

మంచివారమైయుంటాము సరిగదా, బుద్ధిహీనమైనదాన్ని చేయగోరనంత జ్ఞానంగల వారమైయుంటామని మత్తయి 7:12 ఉద్దేశిస్తుంది.[23] లేకుంటే – "నాకు ప్రజలు సారాయి యివ్వాలని కోరుతున్నారు గనుక వీరు నాకు ఏమి చేయగోరుతున్నారో దానినే – ప్రతి ఒక్కనికి సారాయి సీసా యివ్వబోతున్నా"నని త్రాగుడుబోతు తలంచవచ్చు.[24] ఈ సూత్రం తిని, త్రాగడానికి సంబంధించినది కాదు. తిని త్రాగడమనేది మంచిదైయుండ వచ్చు కాకపోవచ్చు; యితరులకు యిష్టమైయుండవచ్చు, కాకపోవచ్చు.[25]

అయితే సువర్ణ సూత్రం ఏమి చెప్పుతుందో ఎక్కువమందికి అర్థమౌతుందని నా తలంపు. ప్రజలందరికి వర్తించే సాధారణమైన సత్యాలను ఈ లేఖనభాగం సూచిస్తుంది. మనమందరం దయగా, కనికరంగా, సగౌరవంగా చూడబడాలని కోరుకుంటాం. గనుక మనం యితరులను ఆలాగే చూడవలసి యుంటుంది. మనం అభినందనలను కోరుతాం. యితరులను మనం అభినందించవలసి యుంటుంది. మనలో మంచిని చూడాలని మనం కోరుకుంటాం. ఇతరులలో ఉన్న మంచిని మనం చూడ ప్రయత్నించాలి. (కాని వారిలో చెడ్డను కనిపెట్టడానికే మనం సహజంగా ప్రయత్నిస్తాం). ఈ జాబితాను మనం పొడిగించవచ్చు. ఇతరులు మనలను అర్థం చేసికోవాలని, మన పొరపాట్లను కనికరముతో కప్పి క్షమించాలని మనం కోరుకుంటాం – గనుక నీకు వారు చేయాలని నీవు కోరుకునేది – మొదట నీవు వారికి చేయుము.

ప్రతి ఒక్కరు ప్రతి ఒక్కరిని కుటుంబంలో, బంధువులుగానో, సంబంధీకులుగానో అలా చూడగలిగే లోకంలో ఉండడం లేక నివసించడం అద్భుతంగా ఉండదా? మనం ప్రతి ఒక్కరిని అలా చూడడం అద్భుతంగా ఉండదా?

## ముగింపు

కొండమీద ప్రసంగమందున్న సువర్ణ సూత్రంతో అందులోని గొప్ప బోధవలన మహాత్మాగాంధీ[26] తొలిగా క్రైస్తవ్యం చేత యింప్రెస్ చేయబడ్డాడని నేను విన్నాను. అలాటప్పుడు తానెందుకు క్రైస్తవుడు కాలేదని అడిగినప్పుడు, ఆ సూత్రాల ప్రకారం నడిచే (జీవించే) ఎవనిని తాను కనుగొనలేదని విచారంతో అతడు బదులిచ్చాడు. మనం చదివిన సూత్రాల ప్రకారం నేను జీవిస్తున్నానా? నీవు జీవిస్తున్నావా?

మత్తయి 7:1–12ని ఆలాటి మాటలే వెంబడిస్తున్నాయి:

> ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునైయున్నది, దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునైయున్నది, దాని కనుగొనువారు కొందరే (మత్తయి 7:13, 14).

ఆ ద్వారము ఎంత యిరుకైనదంటే, అందులో, ప్రవేశించేవారు ఈ క్రింద పేర్కొనబడినవారే అంటే, బహు ధైర్యంగా నేను మాట్లాడానా?:

- తీర్పు తీర్చు స్వభావం లేనివారు.
- తమ సొంత జీవితాల్లో అవసరమైన మార్పులు చేసికొనడానికి మొదట అక్కరగలవారు.
- సున్నితంగాను వినయంగాను యితరులకు సహాయం చేయగలవారు.
- వ్యాత్యాసాలు, చిక్కులు ఏర్పడినప్పుడు వాటిని దిద్దనేర్చుకున్నవారు.
- దేవునిపై ఆధారపడ తీర్మానించుకున్నవారు.
- సువర్ణ సూత్రం ననుసరించి జీవించేవారు.

అవును, కేవలం మానవ సంబంధాలను మించి మత్తయి 7:13, 14 వర్తిస్తుందని నేను ఎరుగుదును. మరియు తప్పక ఈ లేఖన భాగంలో పైన పేర్కొనబడినవి చేర్చబడతాయి. ఇతరులతో ఎలా మసలుకోవాలో లేక సాగిపోవాలో నేర్చుకొనడం ఎంతో ముఖ్యమైన విషయం! (నియమం ప్రకారమైన సత్ సంబంధాలు లేకుండ యిరుకు మార్గంలో ప్రవేశముండదు).

ఇతరులను చూడవలసిన తీరులో చూడకుండ గతంలో నీవు తప్పిపోయావా? నేను కూడా నీలాగే తప్పిపోయాను. మన లోపాల విషయమై మారుమనస్సు పొంది, తప్పులు దిద్దుకొని, భవిష్యత్తులో సరిగా జీవిస్తామని తీర్మానించుకుంటే – దేవుడు తన కనికరము చొప్పున క్షమిస్తాడని గుర్తించడం అద్భుతం కదూ?[27] ఈ ప్రసంగంలోని తొలిపాయింటు, మన జీవితంలో అవసరమైన మార్పులు చేసికొనడానికి మొదటిగా అక్కర చూపాలి. స్వపరీక్షకు యిది సమయం. అవసరమైన మార్పులు చేసికొనడానికి నీ జీవితం విలపిస్తే, మాకు దయతో తెలుపండి.[28]

---

సూచనలు

[1]"దూలము" యింటిపై కప్పును భరించే కొయ్య అని అంటారు. [2]"నలుసు" చిన్న మొక్క లేక ధూళి. [3]ఉదాహరణకు, మత్తయి 23:24 చూడు. [4] నీ శ్రోతలకు సంబంధించిన వాటిని ఉపయోగించు. [5](లేవీ 13:41) వెంద్రుకలు పెంచుకొనడానికి నేను యితరులకు సహాయపడడం ఎలా ఉంటుందో – కంటిలో దూలం వాడు కంటిలోని నలుసున్నవానికి సహాయపడడం ఆలాగే ఉంటుంది. [6]అతని చంపించడానికి ఇతడు సిద్ధమయ్యాడు. [7]KJVలో "వీక్షించు" అని ఉంది. [8]చూచు అనే పదం కంటే మత్తయి 7:3లోని గ్రీకు పదమైన blepo అనేది ఎక్కువ స్పష్టంగా సూచిస్తుంది. అది – "ఎక్కువ తీక్షణంగా, అక్కరగల ధ్యానమైయుంది" (W. E. Vine, *The Expanded Vine's Expository Dictionary of New Testament Words, ed.* John R. Kohlenberger III with James A. Swanson [Minneapolis: Bethany House Publishers, 1984], 106). [9]A telephone pole is a familiar "beam" or "log" to my listeners. స్రోతలకు పరిచయం ఉన్న దానిని ఉపయోగించు.

[10]J. B. Phillips, *The New Testament in Modern English* (New York: Macmillan Co., 1958), 344. [11]ప్రేమ తాను ప్రేమించువారి క్షేమాభివృద్ధిని కోరుతుంది. నిజమైన ప్రేమ తాను ప్రేమించే వారి జీవితంలోని లోపాలనుగాని పాపాలనుగాని అలక్ష్యంచేయదు. పాపము తన ఆత్మను పాడు చేస్తుంది. మత్తయి 18:15 కూడా చూడు. – ప్రేమ నిర్వచనంతో యిది ఇమిడియుంది. [12]"... మొదట వెళ్లి నీ సహోదరునితో సమాధానపడి అప్పుడు వచ్చి నీ బలి అర్పించుము" అనే మత్తయి 5:23, 24తో దీన్ని సమాంతరంగా గీయవచ్చు. అర్పణను నిరాశపరచడం క్రీస్తు ప్రభువు ఉద్దేశం కాదు; కాని అర్పణకు ముందు ఏమి చేయాలో దాన్ని గూర్చి ఆయన నొక్కి చెప్పారు. [13]నీ కంటిలోని నలుసును

తీసివేయుమని అడిగినప్పుడు, ఆ వ్యక్తి నరికేవాడి కత్తి తీసికొని వస్తే, నీ రియాక్షన్ ఎలా ఉంటుంది? [14]పంది అపవిత్రమైన జంతువుగా ప్రత్యేకించి పరిగణింపబడింది (లేవీ. 11:7); కుక్క నెమరు వేసేది కాదు గనుక అపవిత్రమైనదిగా ఎంచబడింది (3, 4 వచనాలు). [15]అడవి పందిగా దీన్ని చూపవచ్చు. [16]"నీతో నాకు యికను పనిలేదు" అని చూపడానికి యిది గురుతు. [17]ప్రభువే పందుల ముందు ముత్యాలు వేయకుండా ఆపారు. ఒక సందర్భంలో ఆయన పరిసయ్యులకు బదులియ్యలేదు (మత్తయి 15:2, 3; 21:23–27). ఆయన హేరోదుతో మాటలాడ లేదు (లూకా 23:9). [18]ఎఫెసీ. 5:16. [19]నీ అనుభవములో నుండి ఉదహరించు. [20]కొందరు దీన్ని అభినందిచరు. ఇతరుల ఫీలింగ్స్‌ను గూర్చి ఆలోచించడం బలహీనతగా వారు భావిస్తారు.

[21]వ్యతిరేకార్థాన్ని ఆధారం చేసికొన్నట్టయితే, మత్తయి 25లో శిక్ష విధింపబడిన "మేకలు" రక్షింపబడేవే. అవి కీడు చేశావని కాదు, మేలు చేయడాన్ని వారు అశ్రద్ధ చేశారు (31, 32, 41, 42 వచనాలను చూడు). [22]Phillips, 14. [23]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel or A Harmony of the Four Gospels* (Cincinnati: Standard Publishing Foundation, n.d.), 265. [24] "Booze" is a slang term for alcoholic beverages. [25]కొందరికి యిష్టమైన, కొందరికి యిష్టం కాని ఆహారాలను గూర్చిన ఉదాహరణ. [26]మహాత్మాగాంధీ (1869-1948) హిందు దేశపు జాతీయ నాయకుడు. 20వ శతాబ్దపు మహా పలుకుబడిగల నాయకుడు. [27]భవిష్యత్తును మేలుకరంగా జరిగించడమనేది మారుమనస్సులో భాగమైయుంది. [28]దూరస్థుడైన పాపి రక్షింపబడడానికిని (యోహాను 3:16; మార్కు 16:16), తప్పిపోయిన క్రైస్తవుడు పునరుద్ధరింపబడడానికి (అపొ. 8:22; యాకోబు 5:16) నీవు కోరవచ్చు. ఆత్మసంబంధమైన మార్పులకంటె అవసరమైన మార్పులు అంత అత్యవసరంగా ఏవీ ఉండవు.